# విచిత్రవ్యక్తి

(అనువృత్తము)

కే. వి. సుబ్బారావు

చెన్నపురికి నెమ్మదిగా చేరుకున్నాము. మా లెక్చరర్లూ, ప్రిన్సిపాలూ, వేణూ అందఱూ మమ్మల్ని అభినందించడానికి స్టేషనుదగ్గఱకు వచ్చారు. పెద్ద మేళతాళాల్తో, విజయధ్వనుల్తో మేముతెచ్చిన బంగారు కప్పును ఊరేగిస్తూ తీసుకొనివెళ్లారు. అప్పుడుకూడా నేనూ, సుధా ఒకచోట కూర్చోవలసివచ్చింది; ఏమని చెప్పను నాస్థితి —- వేణూ చాలా ఆనందించాడు మావిజయానికి.

మా తెచ్చిన నాలుగువేలరూపాయల కప్పువిలువ కాలేజీవారికి అందటికీ ఒకరోజు సెలవు ఇచ్చుటతో తీరిపోయింది. ఆనాటినుండి నానిర్మలమైన మనస్సు మారిపోయింది. ఒంటరిగా ఉన్నప్పుడల్లా ఏవో పిచ్చి ఊహలు మనసులో దొర్లిపోవడం, నడుస్తూనడుస్తూ ఉంటేనే అవేవో సుఖస్వప్నరేఖలు రావడం, వస్తువు లింకోవిధంగా అగుపడడం, ఎవో ప్రేమప్రతిబింబాల ఛాయలు నామీదిగా ప్రాకుతూఉన్నట్లుండడం, క్లాసులో చెప్పే పాఠాలు మనస్సు కెక్కకపోవడం ఇలాంటివాటితో ప్రతిరోజూ నాజీవితంమీదనుంచి, బరువుగా దొర్లిపోవడం తటస్థించింది. సుఖమో దుఃఖమో ముసుగువేసుకొని ఒకస్వప్నం, గాఢనిద్రలో జొరబడినట్లు, ఏవేవో వింతవింతఅనుభవాల్ని ధరించుకొని ఒకవ్యక్తి నాజీవితంలోకి బలవంతంగా త్రోసుకొని, చొచ్చుకొని వస్తూఉన్నట్లుండేది. ఆవ్యక్తి సుధయేమో అనిపించేది.

అదివరకు ప్రతిదినమూ వచ్చి నన్ను చూచిపోతూఉండే మావేణూ ఢిల్లీనుంచివచ్చినతర్వాత అంతతఱచుగా రావడం మానేశాడు. అందువలనకూడా మనోభారం నాకు ఎక్కువైంది. వాడికి పని తీరుబాటు లేకపోవడంవల్ల రాలేదేమో అనుకొని నేను రెండుమూడుసార్లు లాల్‌గారి ఇంటికివెళ్లి వేణూను పిలిచాను. కాని వాడు లేడని వినిపించారు ఇంట్లోవాళ్లు. సుధను క్లాసులోమాత్రం చూస్తూఉండేవాణ్ణి. నామనస్సులో బాధ ఆమెకేం తెలుసునూ?

ఇంతలో నామనస్సులో ఒకసందేహం పుట్టుమన్నది, సుధ ఎవరూ అని.

తగనివాళ్లమీద మనస్సు పారడంలేదుగదా అని అడిగింది అంతరాత్మ; మనస్సుమాత్రం—

"సతాంహి సందేహపదేషు వస్తుషు
ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః"

అని బోధించింది. ఆకల్లోలం అంతటితో అణిగింది కాని వెంటనే "ఈరమణీలలామ" అనేపద్యం స్ఫురణకు వచ్చిందికూడాను.

కాలేజీనుంచి వచ్చి ఇలా మనస్సులోనే మీమాంస చేస్తూఉన్నసమయంలో వేణూ వచ్చాడు.

"బావా, పనితొందరమీద రాలేకపోయినాను. నాలుగురోజులైంది నిన్నుచూచి. అలారా, బీచికి వెళ్లుదా" మన్నాడు.

"సరే" అని ఇద్దఱమూ సముద్రతీరానికి వెళ్లి దూరంగా ఎవ్వరూరాని ఒకచోట కూర్చున్నాము.

"నాలుగురోజుల్నుంచీ నన్ను చూడడానికైనా తీరికలేని ఏమంత పెద్దపని వచ్చిందోయి" అన్నాను.

"బావా, పనిఏమీలేనివాళ్లకే తీరిక ఉండకపోవడం; పనిఉన్నవాళ్లకు ఆపని ఐపోగానే వాళ్లకంతా తీరికే! పనిలేకనే నాకు తీరికలేకపోవడం" అన్నాడు.

"అయినా ఇన్నాళ్లవలె నీవు ఉల్లాసంగా కనపడటంలేదు. నీమనస్సులో ఏదో బరువు తూగుతూ ఉన్నట్లు నాకు తోస్తుంది. ఏడ్చిఏడ్చివచ్చినవాడివలె నీముఖంలో ఏదో దీనత్వం కనబడుతూఉంది. కారణం తెలీదు. వేణూ ఏమి? చెప్పవూ?"

"అబ్బే బావా, ఏమీ లేదు. మనోదౌర్బల్యం దప్ప ఏమీ లేదు. వంట్లో పసిగాలేదు. అంతకన్నా విశేషం ఏమీ లేదు" అన్నాడు.

"పోనీ, ఇంటికి ఉత్తరం వ్రాయనా? లాల్ గారింట్లో పదుపాయాలన్నీ సరిగానే ఉన్నాయిగా! ఇక్కడికన్న అక్కడే చాలా బాగున్నదని చెప్పేవాడివి కదూ? క్రొత్తచేయదగ్గవిశేషా లేవీ పుట్టలేదుగా! బావా ఏదో ఉంది నీమనసులో?" అన్నాను.

"ఏదీ లే"దంటూనే ఊకబురు ఆకబురు చెప్పి ఆసాయంకాలం నాతో గడిపి ఇంటికి చేరుకున్నాడు వేణూ.

మర్నాడు శనివారం. కాలేజీలేదు. మధ్యాహ్నం రెండుగంటలైంది. ఆనాడు ఎండ కొంచెం తీక్ష్ణంగాఉంది. ఉక్క పోస్తూఉంది. వట్టివేళ్లతాపలు కిటికీల క్రిందికి దించి తలుపు ఓరగావేసి ఉత్తరరామచరిత్ర దీసి,

"త్వం జీవితం త్వమసి మే హృదయం ద్వితీయం
త్వం కౌముదీ నయనయో రమృతం త్వమఙ్గే"

అని సగం చదివేసరికి "విరమ! విరమ! ఇయమస్మి" అనుకుంటూ తటాలున తలుపుతెరుచుకొని లోపలికి వచ్చింది సుధ. నేను తబ్బిబ్బైనాను. వెంటనే. లేచి పర్టుకూడావేసుకొని కుర్చీలాగి, "కూర్చోండ"న్నాను.

"మండువేసవిలో మిట్టమధ్యాహ్నంఅప్పుడు కూడా శీతలసుధాచంద్రికలు కనబడతవేమండీ" అన్నాను విచిత్రంగా.

"అగుపడ్డా చుట్టూ ఆతపానికి ఉడుకుతూ ఉన్న అంతరంతోనూ, ఉబుకుతూఉన్న హృదయంతోనే అగుపడ్డతవి కాని ఎన్నడూ శీతలంగా మాత్రం కనపడవు" అంది సుధ నవ్వుతూను.

"తామెంత ఉడికినా. ఎంతఉబికినా ఎదుటివాళ్లను మాత్రం రంజింపక మానవుగా! వాటి నైజమే అది. అందువలన ఏతద్దర్శనం ఆనందకరమైన విషయమే" అన్నాను.

"ఇదే మీజాతిలో దుర్గుణమన్నాను, మోహన్, తా నెంత ఉడికినా నీకక్కరలేదూ? నీసుఖంమాత్రం నీకు కావలెనేమి? నిన్ను రంజింపక దానికి తప్పదేమి? నీకొఱకు అది ఆత్మార్పణం చేసినా బాగా నేమి. "చిన్న నాపొట్టకు శ్రీరామరక్ష" అని నీసుఖంతో నీ కడుపునిండిన చాలు నేమి?" అన్నది తీవ్రంగా సుధ.

"పొరపడ్డావు, సుధా, బాగా పొరపడ్డావు! తన మకరందం శేటికర్పించనంతవరకూ, తన వాసన సమీరకుమారునికి సమర్పించనంతవరకూ తన సోయగము ఆనందించే కండ్ల కందివ్వనంతవరకూ కుసుమముజీవితమెందుకుచెప్పూ? చేపకు తనపిల్లలను కండ్లార చూస్తేగాని కడుపునిండదు. తాబేలుకు తన పిల్లలను తలుచుకుంటేగాని తుష్టికలగదు. ఒకళ్ల నానందింప చేయడమే తానానందించడమని ప్రప్రథమాన్ని పరమేశ్వరుడు పలికిన వాక్యం. ఆమహావాక్యానికి పురుషజాతి కొంచెం ఎడంగా జరిగితే జరిగిందిగాక. అసలుచోటులేని స్త్రీహృదయాని కాచోటిచ్చి మరీ జరిగింది.అందువలన మాజాతియొక్క ఆత్మౌదార్యం, అస్వార్థపరత్వం, ఆత్మార్పణోత్సాహం వెల్లడింపబడుతున్నాయి కాని, నీవన్నట్లు ఆత్మప్రియత్వం కాదు సుధా, ఎన్నటికీ కాదు" అన్నాను.

"మోహన్, ఏమీ చేతకాకపోయినా మగవాళ్లకు మాటలుమాత్రం బాగా చేతవుతాయి. నిన్ను కదలించడానికి నాకు భయం వేస్తుంది. నాకు నచ్చినా నచ్చకపోయినా మనస్సునకంటే సమాధానం చెప్పుతావు. అందుకనే నీదగ్గఱ కూర్చున్నంతసేపూ, నీతో మాట్లాడుతున్నంతసేపూ, నామనస్సునకేదో చెప్పరాని తన్మయానందం కలుగుతుంది. ఎంతసేపైనా నీదగ్గఱే

ఉండాలనిపిస్తుంది. ఎవరి కనిపించదూ?" అన్నది సుధ నావైపే చూస్తూ. ఏలనోకాని నాకు వెంటనే ఢిల్లీ సత్రంలో నాటిరాత్రి కన్న కల స్ఫురణకు వచ్చింది. భయంవేసింది.

"సుధా మనుష్యుడి హృదయం అద్దంవంటిది. ఆఅద్దం మంచిఅద్దమే అయితే ప్రకృతిప్రతిబింబాలు సవ్యంగానే కనపడతాయి అందులో; లేక అది భూత అద్దమే ఆయెనా, నిజంగా ఉన్నదానికి భేదంగా వస్తు గుణాల వికృతస్వరూపాలు అందులో కనపడతాయి. నీమనోముకురం స్వచ్ఛమైనదీ, స్నిగ్ధమైనదీ కనుక మంచిని మంచిగాను, చెడ్డనుచెడ్డగాను గ్రహిస్తుంది. అందులో నాపాప చక్కగానే కనపడిందంటావా? నిజంగా అది నాపూర్వపుణ్యభాగ్య మంటాను. నాఅదృష్ట ఫలమంటాను" అన్నాను.

"మోహన్, నిజంగా నీవు విజ్ఞానమూర్తివి. నిన్ను నేను అనునిమేషం తలుచుకోకుండా ఉండలేనంటే నమ్మవేమో?" అంది సుధ ఓరగా చూస్తూ.

"సుధాహృదయంలో ఈమోహనుడు కూడా ఒకస్థానం ఆక్రమించుకొనిఉన్నాడని యిదివరకే తెలిస్తే నిజంగా నన్ను నేను మరచిపోయే ఉందును. సుధా! యీక్షణంనుండి వలపెఱుగని నా యీ ఏకైక హృదయాన్ని దాచిపెట్టే భారం నీది. నాకిక ఏమీ భయంలేదు"

అని మాట్లాడలేక అట్లే ఆమె నిర్మలప్రేమమయ వదనంవంక చూస్తూ ఊరకున్నాను. సుధకూడా తన్మయానందం అనుభవిస్తూఉన్నదానివలె నన్నలా చూడనిస్తూ నాకండ్లమనసు తీరుస్తూ ఒయ్యారంగా కుర్చీలో అల్లాగే కూర్చుంది. కొంతసేపైనతరువాత సుధ టైమును చూచి,

"అప్పుడే నాలుగైంది; మోహన్; వెళ్ళనా" అన్నది సుధ చిలిపినవ్వు నవ్వుతూ.

"సుధా! నాలుగైనమాట నిజమే. వెళ్లేవారు వెళ్లిపోతే ఒక్కడనూ సుధా! ఉండనా"? అన్నాను. సుధ ముఖంత్రిప్పింది. ఆమెకు నామాటకు నవ్వువచ్చినట్లుంది. వెళ్తూవెళ్తూ-అదొక పిచ్చిపనిలెండి సుధ ఏమనుకొన్నదో ఏమో?—తన జేబురుమాలు నామీద విసిరివేసి వెళ్లిపోయింది.

## ౭

కాలేజీనుంచి వచ్చి బీచికి వెళ్దామనుకుంటూ ఉండగానే వేణూకూడా వచ్చాడు. ఆరోజున మా వేణూవాలకమేమీ బాగులేదు. దిగులు చింత ఎఱుగక నిరంతరప్రసన్నంగా ఉండే ఆముఖంలో ఏవో వ్యసనమేఘాలు గ్రమ్మినట్లుగా విషాదంగా ఉంది. కొంచెం భయంకొలుపుతూ ఉందికూడాను. హిప్నాటిస్టు కండ్లలోవలె వాడి కండ్లల్లో ఎదుర్కొలేని అనిర్వాచ్యశక్తి భయంగొల్పుతూ ఉంది. కాని అతని వాలకంలో మేఘంలో మెఱుపులాగా ఏదో క్రొత్తమధురిమ చావక గోచరిస్తూనే ఉంది. నేను ఆరోజున చాలాసార్లు మాటలకి తడబడవలసివచ్చింది.

"బావా, మొన్న నీదగ్గఱనుండి వెళ్లినదగ్గఱ్నుండి నాలో చాలావిచిత్రమైన మార్పు కలుగుతూ ఉన్నట్లు నాకే గోచరిస్తున్నది. ఈమార్పు నా వ్యక్తిగతమైనదే! నాఅభిరుచుల్ని గుఱించిందే" అన్నాడు ఉదాసీనంగా మావేణూ నావంక చూచి.

"నాకు కూడా అలాగే అనిపిస్తున్నది. వేణూ, ఇదివరకులాగ నీముఖంలో ఆరోగ్యకళలు అగుపడడం లేదు. వంట్లో సరిగాలేదా?" అన్నాను.

"అదిగాదు బావా, కొన్నిరోజుల్నించి నామనస్సులో ఏమీ స్వస్థతగా ఉండడంలేదు. నాకు ఇదివరలో ఉన్న మనస్థితికి కేవలం వ్యతిరేకస్థితి యిప్పుడు నామనస్సును చుట్టుకుంటూ ఉన్నది. ఈమనోభారం నీతో వెళ్లబోసుకొని కొంచెం స్వస్థత పొందుదామని నిన్నిక్కడకు ఇలా లాక్కొచ్చాను. ఇంతకూ కారణంఏమంటే నాకే గోచరంకావడం లేదు. పూర్వం నాకు భయంకరములుగాను, జుగుప్సావహములుగాను ఉండే దృశ్యాలన్నీ ఇప్పుడు నాకు చాలా

ప్రీతిదాయకాలౌతున్నాయి. రక్తం అంటే నాకు పూర్వం ఎంత అసహ్యంగా ఉండేదో ఇప్పుడు అంతగా రక్తదృశ్యాలని చూడడానికి నామనస్సు ఉరికే ప్రాకులాడుతూఉంటుంది. ఘోరమైన వ్యాఘ్రపు బొబ్బరింతలు వినడానికి చెవులు విచ్చుకొనిఉంటాయి. బాధ, క్రూరత్వం, భీతి, ఘాతుకత్వం, కృతఘ్నత, ఇలాంటిభావాలను చిత్రించడానికి నామనస్సూరికే ఆగాటపడుతూఉంటుంది.

"వడవడ వడంకిపోదు జీవనపు గొనల
నెన్నడేనాస కళ్ళ తలయెత్తనేని
ఉభయసంధ్యాంచలముల నేదో వెలుంగు
కలుగ కలవరపోవు ఘూకమ్మువోలె
మింటవెలుగు చుక్క మగన్న మిణుగురన్న
నేను సహియింపలేనవ్వి యురులు చెలుము
నాకు ప్రాణమే మెఱపులే లేక యున్న
భాద్రపదమాసమున నమావాస్య రాత్రి."

అని కృష్ణశాస్త్రి పాడుకున్నట్లు నాకు కటికచీకటి పేరుకున్న రాత్రిలో పెద్దపులులు గోండ్రిస్తూ, ఘూకాలు గుఱ్ఱుమంటూ, జంబుకాలు భోరుమంటూ, విశ్వహృదయం మరుగుతూ ఉన్నసమయాన్ని ఏకాకినై వాటితోపాటు నేనుకూడా శ్రుతికలుపుదామని మనసు పరిగెత్తుతూ ఉంటుంది. ఇదివరకు లావణ్యమని విప్రకృతి అనిపించిందో అదే యిప్పుడు అసహ్యంగాను, నీరసంగాను కనబడుతున్నది. "ఏనురుజనైతి, జరనైతి మృత్యువైతి" అనీ, "నామరణశయ్య పఱచుకొన్నాను నేనె" అనీ వ్రాసిన ప్రవాసివాక్యాలకు నామనస్సెంతైనా తృప్తితో నిండిపోయింది. ఈ నావిషాదప్రియమును లోకం ఉన్మాదమని తలుస్తుంది గాక. నాకందులోనే కొంత ఆనందం కనబడుతూ ఉంది. కొంత ఏమిటే? అందఱూ సుఖదాయకాలను కునే దృశ్యాల్లోకంటే నాకీ అనుభవంలోనే ఎక్కువ ఆనందం గోచరిస్తున్నది." అని బాధాకలితమైన హృదయపుటాన్ని గట్టిగా పట్టుకొనినాఒళ్లో తల పెట్టుకొని ముఖం కప్పుకున్నాడు.

"వేణూ, అబ్బా, యిలాంటి మాటలేమీ నాకు చెప్పకు. నాకే భయంవేస్తున్నది."

నీతో చెప్పుకునేనా మనోభారం తగ్గించుకుందామని వచ్చాను. నీవే వినకపోతే ఇంకెవరితో చెప్పుకోను. ఈపరివర్తనదశలో నూత్న సంఘట్టనాలతో ఉఱ్ఱూతలూగుతూ ఉన్న నామనస్సును ఇంకో హీనశక్తి ఒకటి ఆకర్షిస్తూఉన్నది. నన్నుకూడా మన స్సహజములైన చాంచల్యలౌల్యాలతో కూడుకున్న సామాన్యమర్త్యునిగానే యెంచి నా చెప్పేమాటలు సావధానంగా వింటానంటే, నన్ను మన్నిస్తానంటే నా ఉదాసీనవృత్తాంతం చెప్తాను. లేకుంటే నా విషాదంలో నేనే దాక్కుంటాను."

"నీవు చెప్పేమాటలచేతనే కలవరపడుతూఉన్న నన్ను సశేషసందేహాల్లో పెట్టి మఱింత చంపక. నీ వైఖరి నాకు నిజంగా భయంగొల్పుతూ ఉంది."

"ఈ కలతహృదయానికి సాయంగా నాభావబలాన్ని ఒక అతిలోకసుందరి అపహరించింది. నీవు పొరపడినా యీమార్పంతా యీప్రణయచాంచల్యానికి ఫలితమే అని ఊహించవద్దు. నాకు ప్రేమచేత మతిపోయి ఇలాగంటున్నానని అనుకోవద్దు. నేను సంపూర్ణజ్ఞానముతో నుండి చెప్పుచున్నాను. నాకు యీ మనఃపరివర్తనము మొదలుపెట్టింతరవాతనే యీ నీరసశక్తి నన్ను పట్టుకొని బాధిస్తున్నది. నాకు ఆసుందరాంగిమీద వాంఛలేదు. నామనస్సునకు లోకులు దేనిని సుఖమనుకొనుచున్నారో అది పరాఙ్ముఖభావమైనదనీ, దేనిని లోకము దుఃఖమయమని తలుస్తున్నదో అది నాకు ప్రియమైనదనీ, మొదట్లోనే నీకు నేను చెప్పియున్నాను. అందుకని నే నామోహనాంగిమీద ప్రేమవిషయబలముచేత ఇలాగ అంటున్నానని ఎంతమాత్రం అనుకోవద్దు. ఆమె నావలన లోకం అనుకునే సుఖం ఏదైన పొందగోరిందా అంటే కేవలం ఆమె భ్రమిస్తున్నదన్నమాట. ఒకవేళ యీనియుద్ధంలో నామనస్సుకుకూడ ఆమె నచ్చిందా అంటే, నేను దేనిని అతిలోకసుఖంగా తలుస్తున్నానో, దేనిని ఆనం

దానికి పరమావధిగా తలుస్తున్నానో ఆచోటికే ఆమెను చేరుస్తాను" అన్నాడు వేణు గంభీరంగా.

"ఆమె పేరు?"

"నాకు తెలియదు"

"ఆమెను చూపలేవూ?"

"ఆపని నాకు చేతకాదు."

"పోనీ చిత్రకారుడివిగా! ఆమెబొమ్మను వేయలేవూ?"

"యద్యత్సాధు న చిత్రే స్యాత్ క్రియతే తత్తదన్యథా,
తథాపి తస్యా లావణ్యం రేఖయా కించిదన్వితమ్"

అని ఊరుకున్నాడు.

ఇక నాతని అట్టే మాట్లాడించిన లాభం లేదని అనుకున్నాను. వేణు స్థితిని తలుచుకుంటే ఒక్కసారి మాశ్యామల దీనవదనంతో కట్టెదుట ప్రత్యక్షమైంది. నాకు జాలివేసింది మరునాడు శ్యామలను మాఅమ్మనూ తక్షణం పంపవలసిందనీ, ఇక్కడ వేణు స్థితిని గురించీ ఇంటికి ఒక ఉత్తరం వ్రాశాను.

## ౮

మరునాడు నేనే లాలుగారింటికి వెళ్లాను. "వేణూ ఉన్నాడా" అని అడిగాను. 'మేడమీద గదిలో ఉన్నాడ'న్నారు. చరచర మేడమెట్లెక్కి వేణుగదిదగ్గరకు నడిచాను. తలుపు గట్టిగా లోపలవేసి ఉంది. అయినా మావిచిత్రవ్యక్తి ఒంటరిగా ఉన్నప్పుడు ఏంచేస్తూఉంటాడో చూడాలనిపించింది నాకు. తాళపుకన్నంలోనుంచి చూశాను. నామనసు చెదిరిపోయింది. లోపల ఒకదోమతెరదించిన పందిరిపట్టెమంచం ఉన్నది. అందులో ఒకస్త్రీవ్యక్తి ఒయ్యారంగా శయనించిఉన్నది. తలుపువైపు తలపెట్టుకుని పరుండుటవలన నేనామెముఖం చూడలేకపోయినాను. ప్రక్కనే వేణూ నిల్చి నాకర్థంగాని చూపులామె వంక చూస్తున్నాడు. ఇంక నేనొక్కక్షణమైనా అక్కడ నిలువలేదు. గబగబ టెలిగ్రాఫ్ ఆఫీసుకు పోయి శ్యామలను అమ్మను తిరుగుబండికి తక్షణం పంపమని తంతియిచ్చి నేను కాలేజీకి వెళ్లాను. ఆరోజు సాయంకాలం మళ్లీ వేణూకోసం లాల్‌గారింటికి వెళ్లాను. కాని అక్కడ వేణు కనబడలేదు. బీచికి వెళ్లిఉంటాడని వెళ్లి అక్కడ అంతటా వాడికోసం వెతీకాను. కాని వాడిజాడే నాకు కనబడలేదు.

సాయంకాలమైంది. అందరు గృహోన్ముఖులైనారు. చీకటి జగాన్ని ఆవరించుకుంటూ ఉన్నది. సముద్రపుటలలు ఘోరుమంటూఉన్నవి. గాలి హోరుమని వీచడం మొదలుపెట్టింది. తుపాను వచ్చేటట్లుగా ఆరోజున అలలు పొడుగ్గా పైకిలేచి పెఠీలుమని విఱిగి ఒకదాన్ని ఒకటి కొట్టుకుంటూన్నవి. అందరూ వెళ్లిపోయినారు. ఒక్కకారుమాత్రం దిక్కుమొక్కు లేనట్లుగా రోడ్డుమీద నిలిచిఉన్నది. దూరంగా తాటిచెట్లల్లే లేచి విరుగుతూఉన్న కెరటాలమధ్య ఒకచిన్న డింగీమీద ఊగుతూ ఏకాంతంగా ఎవరో మాట్లాడుకుంటూ ఉన్నట్లు మసకచీకట్లో నాకు కనిపించింది. ఇంతతుపానులోకూడా భయంలేకుండా అలాగ సముద్రంమధ్య ఊగులాడుతూఉన్న వాళ్లను చూచి ఆశ్చర్యపడ్డాను. ఒడ్డుకు వస్తారేమో వాళ్లెవళ్లో చూదామని చాలాసేపు వేచిఉన్నాను. ఎంతసేపటికి వాళ్లు వచ్చేవిధం కనపడలేదు. చీకటి దట్టంగా అలముకుంటూ ఉన్నా వాళ్లాసముద్రమధ్యన్నే ఉన్నారు. గాలి అంతకంతకు ఎక్కువౌతూంది. అప్పుడే ఎనిమిదిగంటలైంది. ఇంకాఉంటే హోటల్లో చల్లారిన మెతుకులు తినాలిసివస్తుందనీ అదీకాక చెలరేగుతూన్న తుపానుకు నిలువలేకనూ బయల్దేరి తిరిగివస్తున్నాను. ఇంకా మాయింటికి సగందూరంలో ఉన్నాననగా, యిందాకటి కారు బుర్రుమని నాప్రక్కనుంచే వెళ్లిపోయింది. కారును వేణు నడుపుతున్నాడు. వెనకాల కూర్చున్నది స్త్రీఅని గుడ్డలనుబట్టి పోల్చాను కాని కారువేగంలో ముఖాన్ని చూడడానికి అవకాశం లేకపోయింది. మాబావ నన్ను చూచిఉండడు. లేకపోతే కారు ఆపేవాడే. పోనీలే అనుకొని హోటలుకు వెళ్లి సయించీసయించని భోజనం చేసి ఇల్లుచేరుకునేసరికి తొమ్మిదైంది.

తలుపుతీసి లైటువెలిగించి ఏవిూతోచక షెల్లీని తీసేసరికి, అంతరాత్రివేళా, తుపానులో, తడిసినపైగుడ్డలతో సుధ గదిలోకి వచ్చింది.

"హల్లో! వెల్‌కమ్! నేడన్నీ అద్భుతాలౌతున్నాయి. ఇక్కడ కూర్చోండి! రండి" అన్నాను కుర్చీనిలాగి. సుధ కూర్చుంది.

"ఏమి యింతరాత్రివేళా ఇలావచ్చారు? ఈ తుపాను శనిలాగ పట్టుకొని వదలకుండా ఉన్నది. పాపం మీగుడ్డలన్నీ తడిసిపోయిన వనుకుంటాను. అయినా ఇప్పుడు ఇలా రావడ మెలాతటస్థించింది?" అన్నాను.

"ఎబ్బే ఏవిూలేదు; హాస్టలులో కొందఱు స్నేహితులను చూడడానికి వెళ్లాను. అక్కడనుండి టవున్‌హాలులో ఏదో మీటింగున్నదంటే అక్కడకు కూడా వెళ్లి కాస్తసేపు కూర్చునేసరికి యీతుపాను పట్టుకుంది. అందినబండ్లన్నీ అందఱూను కట్టించుకొని వెళ్లిపోయారు. టాక్సీగాని, బండీగాని, తుదకు రిక్షా కూడ దొరకలేదు. ఏవిూదొరకక ఇలాగ వానలోబడి ఇంటికివెళ్తూ మీయింట్లో ఈ వానదెబ్బకు కాచుకోడానికి గొడుగైనా ఒకటి దొరుకుతుందనే ఆసతో వచ్చాను. ఇవ్వాళ మీయింటికి రావడ మిది నాలుగోసారి. అబ్బా ఏమిచలి?" అన్నది సుధ.

"సుధా, మగవారు ఆడువేషము వేస్తే ఎంత బాగుంటారో నేనెఱుగను కాని, ఆడువాళ్లు మగవేషం వేస్తే చాలాబాగుంటారనిమాత్రం నాకు చాలాబాగా తెలుసును. చాకలివాడు తెచ్చిన నాదుస్తులిస్తాను, అభ్యంతరంలేకపోతే—"

"మోహన్! నీవు చాలామంచివాడవు కానీ అల్లా కూర్చో! నాకోసం ఆటే ఏమీ శ్రమపడకు." అన్నది సుధ. నాకామాట లేమీ అర్థంకాలేదు.

"అవును. ఈవేళ నాలుగుసార్లు నాకోసం ఎందుకు రావాలిసివచ్చింది. సుధా! నన్నను గ్రహించే పని యేమైనాఉందా?" అన్నాను.

"అవును. నీకోసం నాలుగుసార్లు కష్టపడి వచ్చాను. రేపు డిబేటుందని దాన్నిగుఱించి మాట్లాడుదామని, నీకోసం సాయంకాలం నాలుగుసార్లు వచ్చాను. నీవింటలేవని చెప్పించి గదికివేసిఉన్న తాళం" అంది సుధ.

"ఇంత స్వల్పవిషయానికి సుధనింతగా శ్రమ పెట్టినందుకు నన్నెవరేనా క్షమించేవాళ్లుంటే బాగుండును."

"దండించేవాళ్లుంటే బాగుండదూ?"

"అంతకన్నా మరీ బాగుంటుంది సుధా" అన్నాను.

"అయితే నేనే పొరపడుతున్నానన్నమాట. అంటే లోకంఅంతా పొరపడుతున్నదన్నమాట. అంతేనా! మోహన్" అన్నది సుధ పరీక్షగా నా వంక చూస్తూ.

"నాకేమీ అర్థంకాలేదు. దేన్నిగుఱించి పొరపడ్డావో, సుధా, చెప్పితే తెలుసుకోగలనేమో!" అన్నాను.

"క్షమించడం, భోగించడం, సుఖించడం, ప్రేమించడం, ఇలాంటి సాత్వికమైనభావాల్లోనే ఎక్కువ ఆనందం ఉంటుందని లోకం అనుకుంటున్నది అనుకుంటాను. నేనుకూడా ఇంతవరకూ సుఖంలోనే ఆనందం ఉంటుందనే మతంలోనిదాన్నే. పెక్కురోజుల్నుంచీ నేనొక కళామూర్తిని చూస్తున్నాను. అతడూ మొట్టమొదట ప్రేమ, భోగము, సుఖము వీటిలోనే ఆనందంఉందనుకుని, ఆఅనుభవాలను సంయమించుకొని బయటికి పద్యాలుగాను, చిత్రాలుగాను వ్రాసేవాడుట. కొద్దిరోజుల్నుంచీ, అతడు సుఖంలోకన్న దుఃఖంలో ఉన్న ఆనందమే నిశితమైనదనీ, రుచికరమైనదనీ, దానికి మృత్యువే అవధిఅనీ, అగ్నిపరీక్షలకు ప్రాగిన ఆత్మకుతప్ప అట్టిది అవగతం కాదనీ, లోకానికి విపరీతంగా కనబడే ఇలాంటి సిద్ధాంతాలను చెపుతూ ఉంటాడు. ఇప్పుడు నీవుకూడ క్షమించడం

లోకంతే దండించడంలోనే ఎక్కువ ఆనందం ఉంటుందన్నావు. క్రమంగా నాకు మతిపోతున్నది. ప్రపంచకంలో ప్రాజ్ఞులూ, చదువుకొన్నవాళ్లూ అందరూ ఇలాగే అనుకుంటున్నారా అనీ, అసలు అదే యథార్థతత్త్వమా అనీ నామనస్సు రికే కొట్టుకుంటూ ఉన్నది. విషంపొదిగిన అమృతఘుటిక ఏదో, అమృతం పొదిగిన విషఘుటిక ఏదో తెలుసుకోలేకుండా ఉన్నాను. నీవిజ్ఞానమూర్తిని నేను మనసార ప్రేమించాను· నీయెదుటఉన్నప్పుడు నాకు వేరేఉస్వర్గం కనబడదు· కాని నీయెదుట లేనప్పుడుమాత్రం లాలిత్యానికీ లౌల్యానికీ ఆకరమైన ఆడుజాతికి చెందినదానను కనుక, నా మనస్సు కళామోహం విడిచిపెట్టలేకుండా ఉన్నది. ఆకళామూర్తికూడా యువతులకు అర్హుడనీ, ప్రేమకు పాత్రుడనీ, మన్ననకు తగ్గవాడనీ, తోస్తూఉంటుంది· క్షమించాలి, మోహన్, క్షమించాలి. ఒకవంక నీవిజ్ఞానమూర్తి, వేఱొకవంక ఆతని కళామూర్తి, యీ మీ యిర్వురిమధ్యబడి దారియెఱుగని కెరటమువలె పైకిలేచి అల్లాడుతున్నాను మళ్లీ విశ్వసాగరంలో నాజీవితం లీనంకాకముందే, మోహన్, నన్ను రక్షించుకోమని ప్రాధేయపడుతూఉన్నాను."

అని ముఖంమీద గుడ్డవేసుకొని ఏదో తప్పుచేసినట్లు చిన్నపిల్లలాగ వెక్కడం ప్రారంభించిందిసుధ.

నామనస్సు ఆమెఅంటూఉన్న ఒక్కొక్క మాటకు ఒక్కొక్క ఉబుకు ఉబుకుతూఉన్న సముద్రంలాగ కల్లోలమయమైపోయి ఒక్కసారి భోరుమన్నది. నాహృదయముకు నిక్షేపించుకొన్న సుధ ఇలాగౌతుందని కల్లోగూడ నేననుకోలేదు.

"సుధా, దయయుంచి మీనాన్నగారిపేరు చెప్పగలవా?"

"ఏమి మానాన్నగారికి చెప్పుతారా ఇదంతాను?"

"లేదు బాబూ; అసలే మరుగుతూఉన్న నా హృదయాన్ని మఱింత ఏడిపించక! మీ నాన్నగారెవరు?"

"—లాల్ గారు."

ఆమాట నాహృదయంలో వేయిసార్లు ప్రతిధ్వనించింది. "అయితే నీకళామూర్తిపేరువేణుగోపాలుడు కామా—సుధా!"

ఆమె నివ్వెఱపోయింది. ఒక్కసారి లేచినుంచుంది.

"క్షమించండి! మళ్లీ వస్తాను" అని చరచర వెళ్లిపోయిందిసుధ.

నాహృదయస్థితి చెప్పుకోడానికైనా నాకు సమర్థత లేకుండా ఉంది. ఇవతలసుధ;, అవతల శ్యామల, మధ్య వేణు ఫొటోగ్రాఫ్‌లో లాగ నాహృదయరంగంలో నంచుని ప్రత్యక్షమైనారు.

నాకేమీ తోచలేదు. వెంటనే వేణూ దగ్గరకు పరిగెత్తుదామనుకున్నాను. ఏమిలాభం? ఈఉపద్రవాన్ని నివర్తించేశక్తి ఆపరమాత్మునికే తప్ప నాలో ఏమీ లేదు. వేణూ హృదయాన్ని నేను త్రిప్పలేను. అది వివిధమైన అగ్నిపరీక్షలకు క్రాగుతూ ఈభౌతికాన్ని అతిక్రమిస్తూఉన్న ఒక ఆత్మ. దానివేగాన్ని, పరిణామాన్ని ఆపుదామనుకోటం కాలాన్ని మళ్లించుదామనుకోటమే. ఎటొచ్చీ మాశ్యామల నలిగిపోతుంది. ప్రొద్దున వేణూ గదిలో ఉన్నది, సముద్రంమీద పడవలో వేణూతో ఉన్నదీ, కారులో సాయంకాలం నేను చూచినదీ సుధయే అని తెలుసుకున్నాను. ఈఊహకు నామనస్సు వక్రంగా చుమ్మలుచుట్టుకొనిపోయింది. పాపం సుధకు వేణూ ఒకపెండ్లి అయిన గృహస్థుడనీ, మే మిద్దరమూ బావమఱదులమనీకూడా తెలీదనుకుంటాను. లాల్‌గారైనా చెప్పిఉండరనుకుంటాను. వారికైనా మేము బావమఱదులమన్నమాటమాత్రమే తెలుసును కాని వేణూ వివాహితుడనేసంగతి తెలీదనుకుంటాను. ఇంట్లోనే ఉండి యిలా ఇర్వురికి ప్రేమాంకురాలు మొలకెత్తుతున్న వన్నసంగతి అసలాయన గుఱుగడని అనుకోను. సుధ అవివాహిత, వేణూ తగినవాడు. వారిమధ్య లేనిపోని నిబంధనలు ఏర్పఱిచి ఆశాభంగము ఎందుకు కల్పించాలని లాల్‌గారు వారి స్వైరవర్తనము కని

పెట్టేకూడా ఊరుకుని ఉండవచ్చుకూడాను. ఏమో లెండి అదంతా నాకు తెలీదు. ఇంతకూ తమలపాకులవాణ్ని నేనైనానుగనక ఇతరులను గుఱించి ఎలాగైనా అనుకుంటాను. నాఊహాలు అసత్యాలు కావని ఏమిరూఢి?"

ఇలా అనుకుంటూఉండగానే "ఐంది. వీథిలో బండి ఆగినచప్పుడుకూడా వినది. వెళ్లి చూచాను. దీనవదనాలతో మాఅమ్మ, శ్యామలా, నాన్నగారుకూడా దిగారు. వేణుసంగతి ఏక్షణాని కాక్షణమే భయాస్పదంగా ఉందిగనుక వెంటనే లాల్‌గారి యింటికి వెళ్దామనుకున్నాను. అదృష్టవశాన్ని ఇందాకటినుంచి హోరుమంటూన్న పంచభూతాలూ కొంచెం శాంతించినయి. అప్పటికిమాత్రం మావాళ్లతో ఏమీ చెప్పలేదు.

బండిలో మాత్రం మాశ్యామల

"అన్నా ! ఏమినాగతి" అని నాచేతుల్లో తన ముఖం పెట్టుకుని యేడ్చింది.

"నీకేం భయమమ్మా కన్నతల్లీ" అని అమ్మ నాన్నగారూ దాన్ని దగ్గఱకు తీసుకున్నారు.

మేము వెళ్లేసరికి లాల్‌గారియింట్లో అందఱూ లైట్లు ఆర్పివేసి పడుకున్నారు. అప్పుడే ౧౨ కావస్తున్నది. వెళ్లి లాల్‌గారి వీథితలుపు తట్టినాము. నడుస్తూ శ్యామల నన్ను చుట్టుకుని

"అన్నయ్యా! భయంవేస్తున్నది" అని దీనంగా అన్నది.

"ఎందుకూ భయం! వెఱ్ఱితల్లీ" అని అమ్మ నాన్నగారూ దాన్ని చేరదీశారు.

కాపలాఉన్న నౌకరు తలుపుతీశాడు. "వేణూ ఉన్నాడా" అన్నాను.

"గోపాలంగారా! పైన గదిలో ఉన్నారు" అన్నాడు.

ధ్వనిచేస్తే ఇతరులకు నిద్రాభంగ మౌతుం దని నెమ్మదిగా నడిచి మెట్లెక్కి పై అంతస్థును చేరినాము. శ్యామలను చూచి ఐనా వేణూ మనసు మారుతుందేమో అని, అమ్మా నాన్నగారు దాన్నే ముందు నడవమన్నారు. వణుకుతూ ఉన్న చేతులతో నన్ను చుట్టుకొని

"అన్నా! భయం వేస్తూన్న" దన్నది నాముద్దు చెల్లెలు. కాని అమ్మ నాన్నగారూ,

"నీవిల్లా అడ్డాలుచెపితే, తల్లీ, చాలా కష్టం వస్తుంది. మేం చెప్పినట్లు చెయ్యి. వాడికళ్లకు ముందు నీ వగుపడాలి. ఏదిరా వాడిగది?" అని నెమ్మదిగా నన్నడిగారు.

"అది" అని నాలుగైదుగజాల్లో ఉన్న గదిని చూపించాను. లోపల లైటు వెలుగుతూన్నట్లుంది. శ్యామల విహ్వలిస్తూ వెనుక్కు తిరిగితిరిగి చూస్తూ నడుస్తున్నది. గదిద్వారాన్ని సమీపించాము. తలుపులు ఓరగావేసిఉన్నయ్. శ్యామల వెనకనే నేనూఉన్నాను. శ్యామల తలుపునెట్టింది.

* * * * *

అది ఘోరమైన సంగతి. నేను వ్రాయనూ లేను. మీరు చదవనూలేరు. వెనుక చెప్పిన పందిరిపట్టెమంచం మీద ఒయ్యారంగా పడుకుని సుధ నిద్రపోతూన్నది. ప్రక్కనే వేణూ భయంకరంగా ఎత్తిన చేతిలో ఒక తళతళలాడే ఒకకత్తిని పట్టుకొని పొడవడానికిసిద్ధంగా ఉన్నాడు. చేయిక్రిందికి దిగుతూన్న సమయాన్ని శ్యామల ఏమనుకున్నదో ఏమో గభాలున పరుగెత్తి నిద్రిస్తున్న సుధవక్షంమీద బోర్లపడ్డది. వేణూ చేతి విసురు ఆపలేదు. నేనుకూడా తటాలున ముందుకుఱికి వాడిచేయి పట్టుకునేసరికప్పుడే బాకు శ్యామల కంఠంలోనుంచి పూర్తిగా దిగిపోవడం, శ్యామల "అన్నా" అని ఒక్కఅఱచి ఊరుకోవడం, సుధ కంగారుతో మీదనున్న శ్యామలను త్రోసి కూర్చోటం, శ్యామల క్రిందపడడం, అన్నీ ఒకసారి జరిగినయ్. ఇదంతా ఒకత్రుటిలో జరిగిపోయినసంగతి.

శ్యామలవేసిన కేకకు ఉలిక్కిపడి అందఱూ నిద్రలనుండి లేచారు. అమ్మను నాన్నగారిని గుఱించి నేను చెప్పను. వారిమాట ఎత్తుకుంటేనే నాగుండెలు

చెక్కలౌతాయి. లాల్ గారుకూడా భయంతో గబగబా వచ్చి ఈభీకరదృశ్యాన్ని చూచి "పోలీస్, పోలీస్" అని కేకలువేశారు. తక్షణం పోలీసుస్టేషనుకు తంతి వార్త ఇచ్చారు కొందఱుజవానులను పంపమని. ఏడుస్తూఉన్న ఆజనబృందంలోకల్లా ఆనందంతో పకపక నవ్వుతూన్నవాడు మావేణూ ఒక్కడే. ఎదురుగా కిటికీ ఒకటిఉంది. దానికి విజయముపొందినవాడిలాగ వేణు ఆనుకుని ఓరగా నుంచున్నాడు. మాకందఱకు వెఱ్ఱి అనిపించే ఏదో నవ్వుమాత్రం నవ్వుతూన్నాడు. వేణుకు చచ్చిపోయినది శ్యామల అని తెలిసి ఉండదనుకున్నాను. నేను వాడికి యీసంగతి చెప్పుదామని వేణూ దగ్గఱకు వెళ్తూఉంటే లాల్ గారు నన్ను పట్టుకొని "వాడికి మతిభ్రమించింది. దగ్గఱకు వెళ్లకు. నీచెల్లెలుకు పట్టిన గతే నీకూ పట్టుతుంది" అన్నారు. ఆమాట వేణూ విన్నాడు. ఒక్కసారి శవంవంక చూచాడు. ప్రక్కనే మోకరించాడు. శ్యామల రెండు చేతులను తనముఖముమీద కప్పుకుని ఒక్కసారి ఆకాశంవైపు నిమీలితనయనుడై తలయెత్తి నిశ్శబ్దసమాధిలో కొంతసేపున్నాడు. తర్వాత లేచి నవ్వుతూ నాదగ్గఱకు వచ్చాడు. దగ్గఱకు వస్తూఉంటే వాణ్ణిచూచి అందఱూ వెనక్కు తప్పుకున్నారు. వేణూ నా చేయిపట్టుకుని బలవంతంగా కిటికీదగ్గఱకు లాక్కుపోయినాడు.

"బావా, నీ వేమీ భయపడవద్దు. నామనస్థితిని సుత్తిఱిగినవాడివి నీవేకనుక నీతో నేమాట్లాడుతున్నాను. నన్నుగుఱించి ఎవ్వరూ భయపడనక్కర్లేదు. నాకు ఏది మిక్కిలి ప్రీతిపాత్రమైనదో దానినే నేను నాస్థానానికి చేర్చుకున్నాను. మీరు తటస్థవ్యక్తులు. మీరు నావలన భయపడనక్కరలేదు. చెఱుపుట నాకానందము. అందువలన నాకు మిక్కిలిప్రియమగువస్తువును నేను చెఱుపుకొన్నాను. మీరు దీనికి ఇతరముగా భావింపవలదు" అన్నాడు.

"అది! శ్యామల!" అన్నాను గద్గదకంఠంతో.

"ఔను! మొదట సుధను ప్రియమగు వస్తువనుకొన్నాను. కాని భగవంతుడు నీకు నిజమగు ప్రియపదార్థము సుధకాదు, నీవు వెనుక విడిచివచ్చిన శ్యామలయే అని దానిని ఈలాగున ఈడ్చుకొనివచ్చినాడు. ఆనందానికి ఛాయ అయిన సుధకంటె నిజమగు నాఆనందనిధిని, నాశ్యామలనే నాస్థానానికి తీసుకొన్నానని తెలుసుకొనుటకు మిక్కిలిసంతోషిస్తున్నాను."

ఇంతలో పోలీసుస్టేషనునుంచి పోలీసులు వచ్చారు. లాల్ గారు "వీడున్మత్తుడు— కూనీచేశాడు — అదుగోశవము— వీణ్ణి పట్టుకుని వెళ్లండి" అన్నాడు. నవ్వుతూఉన్న వేణూను ఇన్స్పెక్టరుగారు పట్టుకోబోయినారు.

"ఖడో" అన్నాడు వేణు. విభ్రాంతిగా అందఱూ ఉలిక్కిపడ్డారు,

"ఆ నీపెధవమాలచేతులు నామీదపైని వేయక. పద వస్తా" నన్నాడు వేణు.

సరే నని వెనుకముందుప్రక్కలను భటులు పరివేష్టిస్తూ ఉండగా స్టేషనుకు బయల్దేరినాడు మాకళామూర్తి. కాదు—కాలమూర్తి.

## ౬

......కోర్టంతా చూడడానికీ, వినడానికీ వచ్చిన జనంతోనూ, ప్లీడర్లతోనూ క్రిక్కిరిసిఉంది. ఇది ఇరుపక్షాలూ లేని వింతదావా. మేము వేణూపైన అభియోగం తెచ్చుట యెంతయు హాస్యాస్పదము. ముద్దాయి చేసిననేరం తానే ఒప్పుకొనుచుండుటచేత కోర్టువారిపని తేలికైపోయినది. ముద్దాయిని చచ్చునంతవరకు ఉరితీయవలసినదిగా తీర్పునిచ్చిరి. చివరకు వేణూను ఏమైనా చెప్పుకోదలుచుకొన్నవి ఉంటే చెప్పుకోమని కోర్టువారు సెలవిచ్చారు. వేణూ బోనెక్కి ఇలా చెప్పుకొన్నాడు:

"మహాజనులారా, న్యాయాధిపా, నేటితీర్పు నాకెంతయు ఆనందదాయకముగానున్నది. కాని మానవజాతికి పుట్టడం, చావడం, తిడితేనూ, కొడితేనూ నేరం అనుకోడం, చంపినందుకు శిక్ష మళ్లీ నేరస్థుడి

చావుతో తీరిపోవడం అనే యీకొసవెఱ్ఱి యెంతగా పట్టుకొనిఉందో రెండుమూడుమాటల్లో కొంచెం వ్యక్త పరుద్దామని నేను వచ్చాను; పుట్టడానికి ఎవ్వడూ నేరంచేసి పుట్టడు; ఒకవేళ పిల్లపుట్టినందువల్ల అదివరకు బాగున్న తల్లి చస్తే అదిమాత్రం నేరంగా ఎందుకు పరిగణించకూడదో తెలీకుండా ఉంది. పిల్లను మాత్రం అప్పుడు నేరంచేసినదానిలాగా, ఖూనీచేసినదానిలాగా ఎంచి చచ్చినదాకా దాన్ని ఎందుకు ఉరిదీయరు? బదులుకు బదులు అనే ఈపద్ధతి మొట్టమొదట యీమంటిముద్దమీద అవతరించి, పచ్చిమాంసపు ముక్కలు తింటూ, అగ్నిఅంటే ఏమో ఎఱుగక ఆకులు మొలకు అడ్డంగా పెట్టుకొని, నడాడుతూ, ఉండే ముడిమనుష్యుడిలో పూర్ణంగా ఉండేది. దోవను పోతూఉంటే కాలికి ఎదురుదెబ్బ తగిలిన రాతిని, ముక్కలుగా వ్రక్కలించి పిండిగా గుండకొట్టి, దాన్ని నీళ్లలో కలిపిందాకా వాడికి కసితీరేది కాదు. అల్లా చేయకపోతే తాను ఒక భగవచ్ఛాసనానికి ఎదురునడుస్తున్నా ననుకునేవాడు; అలా చేయకపోవడం ఒక పాపకార్యంగాకూడా భావించేవాడు. మనుష్యుడు ఇంత నాగరికతను సంపాదించానుకొంటున్నాడు. ఇంతవిజ్ఞానాన్ని ఆర్జించాననుకొంటున్నాడు. ఇంత ప్రకృతిని వశపఱచుకొన్నాననుకొంటున్నాడు. కాని నాగరికత, విజ్ఞానమూ అధికమైనకొద్దీ మళ్లీ మానవుడు ఆమొదటి ముడిమనుష్యుడి ప్రకృతికి దగ్గఱగా జరుగుతున్నాడు. ఈవిశాలకాలవలయంలో మొదట తానెక్కడ బయల్దేరేడో అక్కడికే చేరుకుంటున్నాడు. ఇంకాపైగా మానవత్వం పరిపూర్ణత చెందడానికి ఈపద్ధతులే సోపానాలూ, క్రమాంతరాలూ అంటాము. రూపాయి తీసుకుంటే ఉన్నఋణం రూపాయి ఇస్తే తీరినట్లు దెబ్బకొట్టిన బాకీ దెబ్బకొడితే తీరుతుందనేగా మీవాదన? అలాగే ఒకజీవాన్ని తీసినందుకు ఇంకొకజీవాన్ని ఇవ్వడమేగా మీమతం? శ్యామలను చంపినాననేకదా నాగొంతుకు ఉరిపోస్తామంటున్నారు. ఇందులో ఆవేశంతో చేసిన హత్యలు నేరాలు కావనికూడా కాదూ మీ "లా"? ఆవేశంతో ఉన్నవాడిచేతిలో కత్తి తెగక మనఃపూర్వకంగా చెయ్యాలని చేసేవాడి చేతిలో కత్తిమాత్రమే తెగుతుందా? బుద్ధిజాడ్యంచేత తీసుకుంటూ, ఇలాంటి 'లా' నిర్మించినవాళ్లని మంగలాడు బుఱ్ఱలు గొఱిగినట్లే వాళ్ల పీకలు గూడ గొఱిగేసేవాడు లేకగానీ! లేకపోతే ఏమిటంటాను?

రాజ్యవ్యవహర్తఃకు కోపంవచ్చి, ఆదేశం మంత్రీ యీదేశం మంత్రీ, వీడికొడుకును వాడు కొట్టేడనో, వాడికొడుకును వీడు గిల్లాడనో ఒక గడ్డిపోచంత కారణం అడ్డంపెట్టుకొని యుద్ధాలపేరుపెట్టి, అమాయకులూ, నిరపరాధులూ ఐన వాళ్లను ఒకళ్లనొకళ్లమీదబడి నఱుకుకోండని ఆజ్ఞాపించి తాము చూస్తూ ఊరుకుంటారు. ఇన్నిప్రాణాలు పోయాయని ఒక్కళ్లూ చింతించరు. మంత్రులకు కలిగినకోపం ఎన్నిప్రాణాలు తీసినా ఏనేరమూ లేదు. యుద్ధంపేరుపెట్టితే చంపడం నిరాటంకంగా చేయదగినపని; ఖూనీ పేరుపెట్టితే నేరమై ఊరుకుంటుంది. మానవజీవితమంటే ఇంత ప్రాముఖ్యం ఇస్తారు మీరు! రోజురోజూ మీపొట్టలు నిండించడానికి మీరు క్రూరంగా కోస్తూఉన్న నోరులేని జీవాలకు బదులు మిమ్ములను ఎందుకు అడ్డంగా పగలగొయ్యకూడ దంటాను? మనుష్యుడు మాట్లాడ నేర్చాడనీ, నారకీచులూ, నక్కగోళ్లూ, గ్రుడ్డిగవ్వలూ గుల్లసొమ్ములూ, లోహపు ముక్కలూ తగిలించుకొని కులకగలడనీ మీరు మీవాకిట్లో పడిఉన్న కుక్కప్రాణాని కివ్వని విలువ వాడిజీవితాని కిస్తారా? మానవజీవితమంటే అతిపవిత్రంగాను, అతిపునీతంగాను,భద్రంగాను చూడవలసినదనే వాక్యం చావంటే భయపడే పిఱికిపందలూ, తోలుతిత్తులూ సృష్టించారు. ఒకతల కింకొకతల అనే మీసిద్ధాంతం చేతగాని దౌర్భాగ్యులు ఏర్పఱచిన తాతమ్మసూత్రము. ఇంతకూ నేను చావంటే భయపడి, నన్నీలాగ చేసినందుకు చేతకాని ఉడుకుమోత్తనంచేత ఇలాగన్నానని మీరెంతమాత్రం అనుకోవద్దు. సుఖంలో ఉండే తీపికన్న దుఃఖంలోఉండే తీపే ఎక్కువైనదనీ, దుఃఖంలోఉండే ఆనందానికి మృత్యువే పరమావధిఅనీ నేను గట్టిగా నాఅనుభవంచేత తెలుసు

కొన్నాను. నాకు ప్రియమైనవస్తువులన్నీ ఆపరమావధికి చేర్చుకున్నాను. ఈన్యాయకర్తలుఈ నైయాయకులూ, ఇన్నాళ్లాలోచించి ఇచ్చిన తీర్మానంతో నాకేమీ పని లేదు. నేను భూమిమీద పుట్టినకార్యం తీరిపోయినది. ఇక నాస్వస్థానానికి నేను చేరుకుంటాను. నేను మృత్యుస్వరూపాన్ని బాగా అవగీత చేసుకున్నాను. స్వచ్ఛందమరణం పొందగలశక్తి నాకు భగవంతుడు ప్రసాదించాడు. అదిగో శ్యామల! కన్నులముందు తాండవిస్తూ రారమ్మని చేయూపుతున్నది. ఇక సెలవు" అని అలాచూస్తూనే అందరికు వెఱుగువెఱుపుకలిగే ట్టుగా ఒక్కసారిగా నీరై కుప్పవడిపోయినాడు. నిర్జీవమైన అతని శరీరం బోనులో ఒకప్రక్క ఒరిగి పడిపోయింది.

* * *

లోకం వేణూనులాగ నన్నుకూడ వెఱ్ఱివాడను కుంటే అనుకున్నది గాక; వాడు వెళ్లేటప్పుడుమాత్రం వాడిస్వరూపాన్నీ వాడిభావాలనూ నాహృదయంలో స్థిరంగా నాటిపోయాడు. వాడీ లోకంలో ఉండదగిన మనిషికాడు. మొదటినుంచీ ఒకటిగా కలిసిఉండడం చేత నిజ గా వాడుపోయాడంటే మాశ్యామలపోయిన దానికన్నా ఎక్కువశూన్యంగా కనిపించింది నాజీవితం. నాభావాలన్నీ అంధకారపూరితాలైపోయినయ్. ఆ వ్యక్తిలో కలిగిన ఆవిచిత్రపరివర్తనానికి తగినకారణం నేను ఇప్పటికీ కనుక్కోలేకపోయినాను. అందుకనే మనుష్యప్రకృతినిగురించి సిద్ధాంతీకరించి సూత్రీక రించుట ఎవడితరమని ప్రప్రథమాన్నే మనవిచేసుకుని ఉన్నాను. సుధాపరిచయానికి పూర్వమే అతనిలో యీమార్పు కలగడంచేత సుధకు దీనితో సంబంధం కల్పించడానికి నాకేమీ హేతువు కనిపించడంలేదు. చీరకట్టుకున్నవాళ్లు స్త్రీలనీ, పంచకట్టుకున్నవాళ్లు పురుషులనీకూడ వాడప్పటికెఱుగడని నేను చెప్పను. నేనూహించుకొన్నంతవట్టు అప్పటికి వాడు ప్రకృతిలో సుందరమైన భాగాన్ని ప్రథమపురుషులోనుండియే తటస్థముగా అనుభవించాడుగాని ఉత్తమ మధ్యమాలకు గదిలేదు. కాని వాడి కళాదృష్టీ, ప్రకృతివిలాసాలూ ఉత్తమ మధ్యమ పురుషుల పక్షాలై సంఘటించి నప్పుడు మాత్రం మహాత్ము లందఱికిమల్లేనే వాడున్నూ లొంగక తప్పిందికాదు. తటస్థత వహించినంతవరకూ ప్రకృతివిలాసా లాతనికి పుష్టికరములైన జీవనౌషధాలు లాగానే ఉన్నాయి. ప్రత్యక్షపరోక్షాలకు దిగేసరికవ్వే వాడి అంతరాయానికి కారణాలైనాయి. వాడి అంత్య దశలో వాడి మనఃప్రవృత్తి తెలుసుకోడానికి అప్పుడు వాడు చిత్రించిన బొమ్మలూ, వ్రాసినపద్యాలూ కొన్నిమాత్రం వాడి జ్ఞాపకచిహ్నాలుగా మాకు విడిచి పెట్టి పోయాడు. అందులో ఒకదాన్ని పాఠకులకు నివేదించుకుంటాను.

### భయదమూర్తి

నవ్వనేనేడ్పింతు
నవ్వించియేడ్పింతు
యేడ్చి నేనవ్వింతు
నేడ్పించినవ్వింతు
కఠినత్వమేసాజము
ఘోరాతి
కర్కశత్వమెనైజము. ౧.

గండుశిలలేనాకు
మెండుగాముదమిచ్చు
పెనురెుడారులెనాకు
ప్రీతిపైపైగొల్పు
ముండ్లనినపొంగిపోదుఁ
బాధచే
మూల్గుటే వినుచుందును. ౨.

అనునయమ్మన్నతో
డనె నాదుహృదయమ్ము
ఉడుకెత్తి ఉప్పొంగి
తెరలెత్తి పొరలెత్తి
వనిధియై తెరలిపర్వుఁ
కన్నీరు
వఱదలై విరిసిపాఱుఁ. ౩.

భయములోఁగలతీపి
నయములోఁగనపడదు
క్రౌర్యమ్ములో నునుపు
కరుణలో నగుపడదు
తీండ్రించు సింహిమొగమే
తీరాను
దివ్యదృశ్యముల కంటెన్. ౪.

నిప్పునాల్కలుజాపి
నీలపుంబొగగుప్పి
వెఱ్ఱియార్పులనార్చు
వింతజంతువులైన
ప్రళయాబ్ధగళఘోషముల్
నాకిచ్చు
ప్రబలసాసంతోషమున్. ౫.

బ్రతుకు మెలికలలోన
పరితాపములలోన
సారస్యముల ద్రావి
జాలినీరుల గ్రోలి
గాలించి కడగంటిని
జగమందు
కసిగంటె పొడగంటిని ౬.

ఈపరివర్తనం కలిగినప్పుడు వేణు తనజీవితంలో
౪. సుధాపరిచయాన్ని గురించి "మదనురాగోదయ" మని
ఒకఆఖ్యాయికను వ్రాశాడు. వాడి ఆత్మశాంతికై నేను
చేయగలిగిన భవ్యకర్మముగా త్వరలోనే అది గూడా
పాఠకలోకానికి సమర్పించుకుంటాను. ఇప్పటికి సెలవు.

సుధనుగురించిమాత్రం నన్నడగకండి. ఆ-వి
యం తలుచుకుంటే నా గుండెలు కత్తిరించుకుని
పోతాయి. ఆగంభీరకాళరాత్ర్యనంతరం మళ్లీ సుధను
౫. చూచినవాళ్లుగాని. ఆమెనుగురించి విన్నవాళ్లు గాని
ఎవ్వరూ లేరనిమాత్రం చెప్పడానికి నాకనుజ్ఞ ఇవ్వండి.

సెలవు!

---


# భారతీయ చిత్రకళ

గ్రంథకర్త: తలిశెట్టి రామారావుగారు, బి, ఏ., బి. యల్.,

ప్రాచీనకాలమునుండి భారతదేశమున చిత్రకళ పొందుచువచ్చిన మార్పులు, అభివృద్ధి మొదలయిన విషయములు, హైందవ చిత్రలేఖనోదయము, బౌద్ధకాలమునాటి చిత్రకళ, అజంతవిధానము, బాఘ్‌విహారములందలి చిత్రకళ, మొగలు చిత్రకళావిధానము, రాజపుత్ర చిత్రములవైఖరి, నేటిచిత్రములు మొదలయినవానిని గూర్చిన చరిత్రాదులు వివరముగా నీ గ్రంథమున చర్చింపబడినవి. ఆయాకాలపు చిత్రవిధానమును దెలుపునట్టి త్రివర్ణ-ఏకవర్ణచిత్రములు నలువది ఇందు గలవు. చిత్రకారులు, చిత్రకళాజిజ్ఞాసువులు, చిత్ర కళాభిమానులు నగు నాంధ్రులెల్లరు తప్పక చదువవలసిన గ్రంథము. వెల. రు. ౧-౧-౦.

మేనేజరు, ఆంధ్ర గ్రంథమాల, నెం. ౭, తంబుశెట్టివీధి, మదరాసు.